# మొద్దు నిద్ర వీడని సర్కార్

- గురుకులాల్లో అన్నంపెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ దుష్టపాలన
- వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సంక్షేమ హాస్టళ్లలో అదే నిర్లక్ష్యం, అలసత్వమా? అని ప్రశ్నించారు. గురుకుల హాస్టళ్లలో వరుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం తీరు మారడం లేదని, విద్యార్థుల కష్టాలు తీరడం లేదని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తంచేశారు. మంచిర్యాల గిరిజన గురుకులంలో 12 మంది విద్యార్థినులు దవాఖాన పాలై 24 గంటలు కాక ముందే, మరోసారి వాంతులు, కడుపు నొప్పితో విద్యార్థులు హాస్పిటల్‌కు వెళ్లడం దుష్టపాలనకు నిదర్శనమని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాడితప్పిన పాలనకు వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయని మండిపడ్డారు. జిల్లా గురుకులాల్లో దాదాపు 94 మంది దవాఖానల పాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇద్దరు ఇంద్రవెల్లి, నిర్మల్ గురుకుల విద్యార్థులు జ్వరంతో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థుల పరిస్థితిలో ఎలాంటి మార్పులేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సరైన అన్నం పెట్టలేని దుస్థితిలో కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. ఇప్పటికైనా మొద్దునిద్రను వీడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఇంటర్ బదిలీల్లో పైరవీలు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ): ఇంటర్మీడియట్ విద్యలో దొడ్డిదారిన బదిలీలకు కొందరు లెక్చరర్లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రిటెన్షన్ పేరుతో మళ్లీ ఫోకల్ పోస్టుల్లోకి వచ్చేందుకు పైరవీలు చేస్తున్నారు. కొత్త పోస్టులు ఇష్టంలేక, మళ్లీ పాత పోస్టుల్లో పాగా వేసేందుకు చక్రం తిప్పుతున్నారు. జూన్‌లో సాధారణ బదిలీల్లో భాగంగా ఇంటర్ విద్యలోనూ లెక్చరర్లను బదిలీ చేశారు. దీంతో ఫోకల్ పోస్టుల్లో, పట్టణ ప్రాంతాల్లో ఉన్న లెక్చరర్లలో కొందరు గ్రామీణ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఏండ్లుగా పట్టణ ప్రాంతాల్లో పాతుకుపోయిన వారికి ఇది గిట్టలేదు. ఓ కీలక ఉద్యోగ సంఘం నేత తమ సంఘ బాధ్యులకు రిటెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. దీనిని ఆసరాగా చేసుకుని దందాకు తెరలేపినట్టు తెలిసింది. ఇలా రిటెన్షన్ చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను కొందరు లెక్చరర్లు తప్పుపడుతున్నారు. ఇలా అయితే సాధారణ బదిలీలు చేసి ప్రయోజనమేంటని ప్రశ్నిస్తున్నారు.

### ఇప్పుడే ఎందుకంటే..

జేఎల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మరికొద్ది రోజుల్లో 1,392 మంది కొత్త లెక్చరర్లు రాబోతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఫోకల్, పట్టణ ప్రాంత పోస్టులన్నీ కొత్తగా రిక్రూట్ అయ్యే వారే ఎగరేసుకుపోతారు. ఆయా పోస్టులన్నీ భర్తీ అవుతాయి. దీంతో పైరవీలు చేసుకునే వారికి పోస్టింగ్‌లిచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయి. దీంతో ఆగమేఘాల మీద, శరవేగంగా రిటెన్షన్‌కు తెరలేపినట్టుగా ప్రచారం జరుగుతున్నది. ఇందుకు సంబంధించిన ఫైల్ చకచకా కదులుతున్నట్టుగా.. దీని వెనుక పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నట్టుగా వార్తలొస్తున్నాయి. రిటెన్షన్, బదిలీల కోసం ప్రయత్నిస్తున్న వారిలో అత్యధికులు ఖమ్మం జిల్లాకు చెందిన వారే ఉన్నారు. 20 మంది ఒక గ్రూపుగా ఏర్పడి రిటెన్షన్ కోసం తీవ్రప్రయత్నాలు చేస్తున్నట్టుగా తెలిసింది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్టుగా వార్తలొస్తున్నాయి. 'కొందరు దళారులు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. మీరు అనవసరంగా బ్రోకర్లకు డబ్బులిచ్చి సమస్యలు కొనితెచ్చుకోవద్దు' అంటూ ఓ ఉద్యోగ సంఘం నేత లెక్చరర్ల గ్రూపులో పోస్టు పెట్టడం తీవ్ర చర్చనీయాంశమైంది. వారే మళ్లీ ఇప్పుడు రిటెన్షన్ కోసం పైరవీలు చేస్తున్నారు. అత్యంత పారదర్శకమైన బదిలీలంటే ఇవేనా..? అంటూ లెక్చరర్లు ప్రశ్నిస్తున్నారు.

## 'ఉలూం' ఎడ్యుకేషనల్ సొసైటీ అనుమతుల రద్దు సబబే

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తేతెలంగాణ): హైదరాబాద్ బంజారాహిల్స్‌లో సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇంజినీరింగ్, ఇతర కాలేజీల అనుమతులను రద్దు చేయడాన్ని హైకోర్టు సమర్థించింది. ఆయా కాలేజీల అనుమతులను రద్దు చేస్తూ 2017లో ఏఐసీటీఈ జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని తేల్చిచెప్పింది.

# కేసీఆర్ చరిత్రను చెరపలేరు!

- ప్రజల గుండెల్లో కలకాలం పదిలం
- కేసీఆర్ కట్టిన గుడిలోనే సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు
- కాంగ్రెస్ దుష్టపాలనలో విద్యార్థులకు భద్రత కరువు
- సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్
- లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



సిద్దిపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన అనంతరం మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 8: కేసీఆర్ పేరును ఎవరూ చెరిపేయలేరని, ఈ భూమి ఉన్నంత కాల ఆయన తెలంగాణ ప్రజల గుండెల్లో ఉంటారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టంచేశారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీని, తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మరువలేరని తేల్చిచెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద మాటాలు మాట్లాడుతున్నారని, కేసీఆర్ కట్టించిన యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లి తన పుట్టినరోజును జరుపుకొన్న విషయాన్ని సీఎం గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. మూసీ సుందరీకరణ చేసి అందులో గోదావరి నీటిని పారిస్తానంటున్న సీఎం, కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం నుంచే మూసీకి నీటిని తరలించాలనే విషయాన్ని గుర్తెరగాలని చెప్పారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? తెలంగాణ రాకపోతే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యేవాడివా? అని రేవంత్‌ను ప్రశ్నించారు.

### కూలగొట్టుడు తప్ప.. కట్టేదే లేదు

11 నెలల పాలనలో పేదవాళ్లకు ఒక్క ఇల్లు అయినా కట్టించావా రేవంత్‌రెడ్డీ.. అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కూలగొట్టుడు తప్ప కట్టే విధానం నీది కాదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు నాట్లు పడక ముందే రైతుబంధు ఇచ్చేదని గుర్తుచేశారు. ఇప్పుడు పంట చేతికొచ్చినా రైతుబంధు రాలేదని తెలిపారు. కేసీఆర్ బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలకు బట్టలు పంపిణీ చేసేవారని, రెండు చీరలు ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ఒక్క చీర కూడా ఇవ్వలేదని విమర్శించారు. వృద్ధాప్యం పింఛన్‌ను రూ.4 వేలు ఇస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఉన్న రూ.2 వేలను కూడా ఏప్రిల్‌లో, ఆగస్టు నెలల పింఛన్‌ను ఎగ్గొట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసినందుకు తీరని మోసం చేశారని రైతుల్లో ఆవేదన గూడుకట్టుకొని ఉన్నదని తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడు నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోలు జరిగేదని, రెండు రోజులకే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేవని తెలిపారు. పోలీసులతో బెదిరించి ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితిలో సీఎం రేవంత్ ఉన్నాడని, ఆయన బెదిరింపులకు బీఆర్‌ఎస్ భయపడబోదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తేల్చిచెప్పారు.

# కోలుకోని 'ఫుడ్‌పాయిజన్' బాలికలు

- పూర్తిగా నయం కాకుండానే డిశ్చార్జి
- మరో ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత
- విచారణ చేపట్టిన ఐటీడీఏ పీవో
- గేట్ వేసి దాదాపు గంటపాటు విచారణ
- నిరసన తెలిపిన విద్యార్థి సంఘాలు



మంచిర్యాల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల, నవంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాలలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు కోలుకోవడం లేదు. పూర్తిగా నయం కాకుండానే వారిని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేసి హాస్టల్‌కు తరలించారు. బుధవారం 12 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించి గురువారం ఉదయం డిశ్చార్జి చేయగా, అదే రోజు సాయంత్రమే హాస్టల్‌కు తిరిగి వెళ్లిన 12 మందిలో నలుగురు వాంతులు చేసుకున్నారని తోటి విద్యార్థినులు చెబుతున్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు సిక్ రూమ్‌లో ఉన్నారని తెలిసి వెళ్లి వారితో మాట్లాడుతుండగా, అప్రమత్తమైన సిబ్బంది వాంతులు చేసుకుంటున్న ఓ విద్యార్థినితోపాటు కడుపునొప్పితో బాధపడుతున్న మరో విద్యార్థినిని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. జనరల్ సర్జన్ విద్యార్థినులను పరీక్షించి ఫుడ్‌పాయిజన్ జరిగిన ఐదారు రోజులు ఇలాగే ఉంటుందని, కంగారు పడాల్సిన పనిలేదని చెప్పారు. విద్యార్థినులు పూర్తిగా కోలుకోకముందే హాస్టల్‌కు తరలించాల్సిన అవసరం ఏమొచ్చిందని స్థానికులు మండిపడుతున్నారు.

### డైట్ చేంజ్ చేయకపోవడంతోనే సమస్య..

ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినులకు సులభంగా అరిగే లైట్ ఫుడ్ పెట్టాలి. కానీ శుక్రవారం అందరితోపాటు వీరికి టమాట బాత్ పెట్టారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వెళ్లినప్పుడు విద్యార్థినులే స్వయంగా చెప్పారు. కాగా, విద్యార్థినులు మరోసారి హాస్పిటల్‌కు వెళ్లిన విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా శుక్రవారం సాయంత్రం పాఠశాలకు వెళ్లి విచారణ చేశారు. మీడియాను, విద్యార్థి సంఘాల నాయకులను లోపలికి అనుమతించకుండా, గేట్ వేసి మరి దాదాపు గంటపాటు విచారించారు. దీంతో అక్కడికి వచ్చిన విద్యార్థి సంఘాల నాయకులు గేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా మీడియాతో మాట్లాడారు. ఫుడ్, వాటర్ రిపోర్ట్ అన్ని సరిగానే ఉన్నాయని తెలిపారు. విచారణ చేయిస్తున్నామని, రిపోర్ట్ వచ్చాక వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరిగినట్టు సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ఖండించారు. ఫుడ్ పాయిజన్‌కు బాధ్యులైన వార్డెన్‌ను, ఏటీడబ్ల్యూవోను సస్పెండ్ చేయాలని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్ నిలదీశారు.



ఆర్సీపురంలోని ఓలా షోరూమ్‌కు చెప్పుల దండ వేస్తున్న సంతోష్‌కుమార్

## ఓలా షోరూమ్‌కు చెప్పుల దండ

రామచంద్రాపురం, నవంబర్ 8: సంగారెడ్డికి చెందిన సంతోష్‌కుమార్ జీహెచ్‌ఎంసీ ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్ ఓలా ఎలక్ట్రికల్ వాహనాల షోరూంలో గత సంవత్సరం ఆగస్టులో ఎలక్ట్రిక్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఆరు నెలల వరకు బాగానే నడిచినప్పటికీ ఆ తర్వాత మరమ్మతుకు రావడంతో షోరూంలో ఎవరిని అడిగినా పట్టించుకోలేదు. ఎప్పుడు సర్వీసింగ్‌కు ఇచ్చినా నెలల తరబడి షోరూం చుట్టూ తిప్పించుకోవడంతో పాటు సరిగా స్పందించలేదు. విసుగుచెందిన వాహనదారుడు శుక్రవారం ఓలా షోరూమ్‌కు చెప్పుల దండ వేసి వినూత్నంగా నిరసన తెలిపాడు. షోరూం మేనేజ్‌మెంట్ తీరు సరిగా లేదని, ఈ విషయమై కన్జ్యూమర్ కోర్టులో తేల్చుకుంటానన్నాడు.

# గురుకులాల్లో రేవంత్ బర్త్‌డేనా?

- ఏం ఉద్ధరించారని చేయాలి?
- పిల్లలు దవాఖానల పాలైనందుకా?
- పాము కాట్లతో చనిపోతున్నందుకా?
- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు

హైదరాబాద్, నవంబర్ 8 (నమస్తేతెలంగాణ): 'ఏం ఉద్ధరించారని సీఎం రేవంత్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు గురుకులాల్లో అధికారికంగా నిర్వహించాలి? ఫుడ్ పాయిజన్‌తో వాంకిడి ఆశ్రమ పాఠశాల పిల్లలు దవాఖానల పాలైనా పట్టించుకోనందుకా? పాములు కరిచి స్టూడెంట్స్ చనిపోతున్నా సమీక్ష చేయనందుకా?' అంటూ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో సీఎం జన్మదిన వేడుకలు నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడం, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన ఆయనకు నిబంధనలు తెలియకపోవడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేతలు తుంగ బాలు, రఘురాంతో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో గెల్లు శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గురుకులాలను నాశనం చేసేందుకే కాంగ్రెస్ కంకణం కట్టుకున్నదని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసేందుకు అనైతిక చర్యలకు దిగుతున్నదని దుయ్యబట్టారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరిట విద్యార్థులను విభజించేందుకు కుట్రలు చేస్తున్నదని తూర్పారబట్టారు. నాసిరకం సరుకులు పంపుతూ పేద పిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే గురుకుల స్కూళ్లకు పర్మినెంట్ బిల్డింగ్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో అన్ని స్కూళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకొని కేటీఆర్‌కు నివేదిస్తామని వెల్లడించారు. తుంగ బాలు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అవగాహనారాహిత్యంతో అన్ని వ్యవస్థలను కుప్పకూల్చుతున్నారని దుయ్యబట్టారు. సీఎం యాదగిరిగుట్ట పర్యటన సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. నల్లగొండ జిల్లా వెనుకబాటుకు కాంగ్రెస్సే కారణమని మండిపడ్డారు.



# అ'విశ్రాంత' పోరాటం!

▸ మొదటిపేజీ తరువాయి...

రిటైర్‌మెంట్ అవుతున్న ప్రతి విశ్రాంత ఉద్యోగి దీనగాథ!

### హామీలు సరే.. ఆచరణ ఎక్కడ?

ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అనేక హామీలు గుప్పించింది. పెడింగ్‌లో డీఏలను చెల్లిస్తామని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేస్తామని మ్యానిఫెస్టోలోనే ప్రకటించింది. ప్రభుత్వోద్యోగులకు, పెన్షనర్లకు ఇచ్చే డీఏలను సకాలంలో ప్రకటించి, బకాయిలను నేరుగా ఉద్యోగస్తులకు చెల్లిస్తామని, కొత్త పీఆర్సీని ఆరునెలల్లో అమలు చేస్తామని గొప్పలు చెప్పింది. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌తో అన్ని రకాల జబ్బులకు అన్ని దవాఖానల్లో వైద్యం అందేలా హెల్త్ కార్డు జారీ చేస్తామని పేర్కొన్నది. కానీ, గద్దెనెక్కాక అన్నింటి మాదిరిగానే ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించిందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐకాస అక్టోబర్ 22న ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. నవంబర్ 2 నుంచి పోరుబాట పడుతామని హెచ్చరించింది. దీంతో దిగొచ్చిన సర్కారు, అక్టోబర్ 24న ఉద్యోగ సమస్యలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఆ తర్వాత ఐదు డీఏలు ఇవ్వాల్సిన స్థానంలో ఒక డీఏను మాత్రమే ఇచ్చి దాటవేసింది. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

### 8 నెలలుగా అందని ప్రయోజనాలు

రాష్ట్రం మొత్తం సుమారు మూడున్నర లక్షలకుపైగా ఉపాధ్యాయ, ఉద్యోగులు పని చేస్తుండగా.. ప్రతి నెలా దాదాపు 700 నుంచి 1100 వరకు రిటైర్ అవుతున్నట్టు ఆయా సంఘాలు వెల్లడిస్తున్నాయి. నిజానికి ఉద్యోగుల సంపాదిత సెలవులు, గ్రూపు లైఫ్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ, జీపీఎఫ్, తదితర రూపేణా రావాల్సిన సొమ్మును పదవీ విరమణ అయిన వారంరోజుల్లోనే అందించాలి. ఉద్యోగుల హోదాలను బట్టి, ఒక్కో ఉద్యోగి పదవీ విరమణ సమయంలో ₹30 లక్షల నుంచి ₹70 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం పొందుతారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మార్చి నుంచి ఇప్పటివరకు 1026 మంది ఉపాధ్యాయ ఉద్యోగులు రిటైర్మెంట్ అయ్యారు. వీరిలో ఏ ఒక్కరికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదని విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. పదవీ విరమణకు 3,4 నెలల ముందుగానే తాము రిటైర్మెంట్ కాబోతున్నట్టు ఏజీ కార్యాలయానికి ప్రతి ఉద్యోగి తన వివరాలను లిఖిత పూర్వకంగా సమర్పిస్తారు. పేపర్ వర్క్ ప్రాసెస్ ప్రకారం జరిగినా.. ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బులను మాత్రం పెండింగ్‌లో పెడుతున్నది. పోనీ ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదు. దీనిపై విశ్రాంత ఉద్యోగులు నిత్యం ట్రెజరీ కార్యాలయాలకు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అయినా ఎప్పుడిస్తారో ఏ అధికారి వద్ద స్పష్టత లేదు. పోనీ ఆలస్యం అయితే ప్రభుత్వం ఏమైనా వడ్డీ కలిపి ఇస్తుందా..? అంటే అదీ లేదు. గట్టిగా అడిగితే ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని సమాధానం చెబుతున్నారని పలువురు విశ్రాంత ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇలా ఎప్పుడూ లేదు



ప్రభుత్వ ఉద్యోగిగా 30 ఏండ్లు దాచుకున్న సొమ్మును జీవిత చివరి మజిలీలో కోటి ఆశలతో ప్లాన్ చేసుకుంటాం. కానీ మునుపెన్నడూ లేని విషాదకర, విచిత్రమైన పరిస్థితి మన రాష్ట్రంలో నెలకొన్నది. ఉద్యోగులకు అండగా నిలుస్తామని చెప్పి.. ఆర్థిక ప్రయోజనాల విషయానికి వచ్చే సరికి మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకంజ వేస్తున్నది. స్వాతంత్రం తర్వాత పెన్షనర్ల ప్రయోజనాలను వాయిదా వేసిన సందర్భాలు లేవని చెప్పొచ్చు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు సమష్టిగా ఉద్యమాలు చేపట్టి న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలి.

– చందూరి రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీఎస్‌టీయూ

### ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతున్నది



ఒక డీఏతో మా ఉద్యోగులు సంతృప్తిగా లేరు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ వెంటనే ఇప్పించాలి. పదవీ విరమణ పొందిన ప్రభుత్వోద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఈ ప్రభుత్వం రావడానికి ఉద్యోగులు తమ వంతు కృషి చేసిన విషయాన్ని విస్మరించవద్దు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారికి విశ్వాసం సన్నగిల్లుతున్నది.

– దారం శ్రీనివాస్‌రెడ్డి, టీఎన్జీవో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు

### గొప్పలు చెప్పారు.. ఆచరణ మరిచారు



ఒక రిటైర్డు ఉద్యోగి తాను చేసుకున్న ప్లానింగ్ మొత్తం తల కిందులవుతున్నది. 30 సంవత్సరాల పాటు తాము దాచుకున్న డబ్బును ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సబబు అని ప్రభుత్వం ఆలోచించాలి. ఇది ఒక్కరి ఆవేదన కాదు, ఇప్పటికే రిటైర్‌మెంట్ అయిన వారితో పాటు కాబోయే వారి పరిస్థితి ఇలాగే ఉంది. నిజానికి 5 సెప్టెంబర్ రోజు ప్రభుత్వ అధినేతలు రిటైర్డ్ బెనిఫిట్స్ అందజేసి సన్మానం చేసి వీడ్కోలు పలుకుతామని గొప్పలు చెప్పారు. కానీ, ఆచరణలో మాత్రం మరిచారు.

– జాలి మహేందర్‌రెడ్డి, రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు

# ఖజానా కటకట

▸ మొదటిపేజీ తరువాయి...

ఉదాహరణ. ఈ నెల 4న సచివాలయంలో సమావేశం నిర్వహించగా, మళ్లీ 6న మరోసారి సమావేశం అయ్యారు. దీనిని బట్టే ప్రభుత్వం డబ్బు కోసం ఎంతగాఆరాటపడుతున్నదో అర్థం అవుతున్నదని అంటున్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఆర్థిక వృద్ధిలో రాష్ట్రం ఎప్పుడూ వెనుకకు తిరిగి చూడనేలేదు. కరోనా విపత్తు సమయంలో మాత్రమే తడబడింది. సగటున 8 శాతానికి పైగా వృద్ధిరేటు నమోదైంది. అందుకే 'కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ ఆర్థిక రంగానిది ఒక అద్భుతమైన విజయగాథ. దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణను స్ఫూర్తిగా తీసుకోవాలి' అని ఆర్థిక నిపుణుల నుంచి ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. ఇదే వేగాన్ని కొనసాగిస్తే రెండంకెల వృద్ధిని సులభంగా అందుకోవచ్చని చెప్తున్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి భిన్నంగా మారింది. గత ఏడు నెలల్లో వాణిజ్య పన్నుల శాఖ మాత్రమే కాస్త చెప్పుకోదగ్గ స్థాయిలో గణాంకాలను నమోదు చేసింది. మిగతా శాఖలన్నీ నేల చూపులు చూస్తున్నాయి. ఫలితంగా గత ఏడు నెలల్లో ఆదాయ వృద్ధిరేటు 4 శాతం మాత్రమే నమోదైనట్టు గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇది గత సగటుతో పోల్చితే సగం మాత్రమే.

### ఆదాయం పెంచండి

రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే శాఖల్లో ఆశించిన మేర రాబడి రాకపోవడంపై సీఎం, డిప్యూటీ సీఎం అసహనంగా ఉన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ఇప్పటికే ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతున్నదని, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కనీసం సగమైనా అమలు చేయకపోతే పరిస్థితి అదుపులో ఉండదని ఆందోళన చెందుతున్నట్టు తెలిసింది. అందుకే తరుచూ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆదాయ సమీకరణకు ఏకంగా క్యాబినెట్ సబ్ కమిటీనే నియమించారు. ఈ నెలలోనే వరుసగా రెండు సార్లు ఆయా శాఖల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి, ఎలాగైనా ఖజానా నింపాలని ఆదేశాలు జారీచేశారు. పెండింగ్ బకాయిల లెక్క తేల్చాలని వన్‌టైం సెటిల్‌మెంట్లు, ఇతర పరిష్కార మార్గాల ద్వారా ఆదాయాన్ని రాబట్టాలని ఆదేశించారు. బకాయిదారులను కార్యాలయాలకు రప్పించడం కాదని, అవసరమైతే అధికారులే వారి వద్దకు వెళ్లి సెటిల్‌మెంట్‌కు ఒప్పించాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో పాటు భూముల అమ్మకం, తనఖా పెట్టడం ద్వారా నిధులు సమీకరించాలని ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. మైనింగ్ శాఖలో అనుమతులు పొంది, పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై దృష్టి పెట్టాలని, రెన్యువల్స్, పెండింగ్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కూడా చెప్పారట.

### చేసింది చేసి.. మమ్మల్ని అంటే ఎలా?

ఆదాయాన్ని పెంచాలి.. అంటూ తరుచూ మీటింగ్‌లు పెట్టి ఒత్తిడి తేవడంపై ఆయా శాఖల అధికారులు అసహనంతో ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు తీసుకొని ఖజానాను ఖాళీచేసి తమపై ఒత్తిడి తెస్తే ఎలా అని తలలు పట్టుకుంటున్నారట. ఉదాహరణకు.. భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు తరుచూ జరుగుతుంటేనే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం వస్తుందని గుర్తుచేస్తున్నారు. కానీ ప్రభుత్వం హైడ్రా, మూసీ ప్రాజెక్టు, కూల్చివేతల ఫలితంగా క్రయవిక్రయాలు నిలిచిపోయాయని, దీనికి తామెలా బాధ్యులం అవుతామని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలవారీ ఎక్సైజ్ టార్గెట్లు, రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నా ఆదాయం పెరగకపోతే తామేం చేస్తామని తేల్చి చెప్తున్నారని వినికిడి. బెల్ట్ షాపులను బాగా ప్రోత్సహిస్తున్నా ఫలితం ఉండటం లేదని వాపోతున్నారు. ఇదే తరహాలో వాహనాల కొనుగోళ్లు సైతం మందగించాయని అంటున్నారు.

### బీఆర్‌ఎస్ హయాంలో పెరిగిన కొనుగోలు శక్తి

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు, పంట కొనుగోళ్లు, సబ్సిడీలు, బతుకమ్మ చీరలు.. ఇలా వివిధ పథకాల రూపంలో ప్రజల ఖాతాల్లోకి నేరుగా డబ్బు బదిలీ చేసేదని, ఈ డబ్బు భూములపై పెట్టుబడులు, వస్తువుల కొనుగోళ్ల రూపంలో మళ్లీ మార్కెట్‌లోకి వచ్చేదని చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ గొలుసు దెబ్బతిన్నదని అంటున్నారు. మొదటి విడత రైతుబంధు ఆలస్యం చేయడం, రెండో విడత ఎగ్గొట్టడం, బతుకమ్మ చీరల ఆర్డర్ ఇవ్వకపోవడం, పంటల కొనుగోళ్లలో గందరగోళం వంటి చర్యలతో సమాజంలో నగదు చెలామణి తగ్గిందన్నారు. ఇది రాష్ట్ర ఆదాయంపై ప్రభావం చూపిందని చెప్తున్నారు. రానురాను ఈ పరిస్థితి ఇంకా దిగజారుతుందనీ హెచ్చరిస్తున్నారు.



**ఆదాయాన్నిచ్చే శాఖల్లో నమోదైన గణాంకాలు ఇలా (రూ.కోట్లలో)**

| శాఖ | అక్టోబర్ వరకు ఆదాయం | | వృద్ధిరేటు | లోటు/ మిగులు |
|---|---|---|---|---|
| | గతేడాది | ఈ ఏడాది | | |
| స్టాంపులు, రిజిస్ట్రేషన్లు | 8228 | 8164 | -0.78% | - 64 |
| ఎక్సైజ్ | 11047 | 10842 | -1.99% | -205 |
| వాహనాలపై పన్ను | 4113 | 4014 | -2.41% | -99 |
| మైనింగ్ | 4286 | 4200 | -2.01% | -86 |
| వాణిజ్య పన్నులు | 40341 | 43516 | 7.67% | 3175 |
| మొత్తం | 68,015 | 70,736 | 4% | 2721 |


